సాక్షి
విశాఖపట్నం
మంగళవారం, 28, ఫిబ్రవరి, 2023



పలు రైళ్ల గమ్యం కుదింపు..

ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు. మరికొన్ని గమ్యం కుదించారు. 8లో



చేనేత వస్త్ర ప్రదర్శన భేష్

శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసి వస్త్రాలకు ఫిదా అవుతున్నారు. 8లో



పార్కుల సుందరీకరణ

బీచ్‌కు వచ్చే సందర్శకులకు స్వచ్ఛమైన గాలితో నీడనిచ్చేందుకు కొబ్బరి చెట్లు ఉపయోగపడుతున్నాయని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు అన్నారు. 10లో

న్యూస్‌రీల్

హెచ్‌పీసీఎల్‌లో అగ్ని ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు

మల్కాపురం (విశాఖ పశ్చిమ): హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే ప్లాంట్ లోని ఏటీపీ ప్రాంతంలో సోమవారం రాత్రి 11.20 గంటల సమయంలో క్రూడ్ ఆయిల్ ఒక్కసారిగా లీకయ్యింది. వెంటనే మంటలు చెలరేగడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. వాల్వులను కట్టేయ్యడంతో క్రూడ్ ఆయిల్ లీకేజీ నిలువరించారు. హుటాహుటిన హెచ్‌పీసీఎల్ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో పరిస్థితి అదుపులోకి వచ్చిందని, సాంకేతిక లోపం తలెత్తడం వల్లే ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు హెచ్‌పీసీఎల్ అధికారులు వెల్లడించారు.

అప్పన్న సన్నిధిలో కరణం మల్లీశ్వరి



కరణం మల్లీశ్వరి దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం భారత మాజీ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని సూపరింటెండెంట్ నాయుడు అందజేశారు.

కేంద్ర కారాగారంలో 12 నుంచి శిక్షణ


ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారంలో మార్చి 12న బ్యూరో ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై అధికారులకు జాతీయ స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు సారథ్యంలో జరగనున్న ఈ శిక్షణకు దేశంలో అన్ని కారాగారాల నుంచి సబ్ జైలర్ స్థాయి నుంచి సూపరింటెండెంట్ వరకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. జైళ్ల ఆధునికీకరణ, అభివృద్ధి గతంలో ఎలా జరిగాయి, భవిష్యత్‌లో ఏవిధంగా జరగాలి తదితర అంశాలపై ఈ శిక్షణలో ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

ఏపీజీఈఏ జిల్లా సర్వసభ్య సమావేశం నేడు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాన్ని అక్కయ్యపాలెం నరసింహనగర్‌లోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశానికి ఏపీజీఈఏ కార్యవర్గ సభ్యులందరూ విధిగా హాజరుకావాలని ఎస్.వి.రమణ కోరారు.

సైకో వీరంగం





సునీల్ దాడిలో పగిలిన కారు అద్దాలు

బీచ్‌రోడ్డు: నగరంలో ఓ సైకో వీరంగం సృష్టించాడు. కనిపించిన కార్లపై దాడులు చేస్తూ.. ప్రజలను భయాందోళనకు గురిచేశాడు. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు అతన్ని ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ. పీఎంపాలేనికి చెందిన సునీల్(28) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఇందుకోసం గతంలో ఏడాది పాటు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స కూడా తీసుకున్నాడు. కాగా..సోమవారం జీవీఎంసీ దగ్గర రోడ్డుపై వెళ్తున్న కార్లపై రాళ్లతో దాడి చేసి అద్దాలను పగలకొట్టాడు. వెంటనే అక్కడున్న జీవీఎంసీ సిబ్బంది అతన్ని బంధించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సునీల్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు
- దేశ విదేశీ ప్రముఖులకు సిద్ధం చేస్తున్న ప్రత్యేక కిట్లు
- కలంకారీ ఆకృతులు అందించేందుకు ప్రణాళికలు
- కిట్‌లో ప్రత్యేక ఆకర్షణగా అరకు ఇన్‌స్టెంట్ కాఫీ పొడి





అదిరిపోయే ఆతిథ్యం



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర స్థితిగతులను మార్చేలా ఆర్థిక పురోభివృద్ధిలో కొత్త గమనం సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. మార్చి 3, 4 తేదీల్లో జరగనున్న సదస్సుకు దేశ, విదేశీ ప్రముఖులు హాజరవుతున్నారు. వారికి ఆత్మీయ ఆతిథ్యం అందించడంతో పాటు, చిరకాలం గుర్తుండిపోయేలా జ్ఞాపికలు బహూకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం విభిన్నమైన కళాకృతులతో కూడిన 3 వేల కిట్లు తయారు చేస్తున్నారు.

ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో జీఐఎస్-2023 కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉన్నతాధికారులతో పాటు జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పనులను సమీక్షిస్తోంది. దాదాపు 3 వేల మంది ప్రముఖులతో కలిపి మొత్తం 7,500 మంది ప్రతినిధులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి అదిరిపోయే ఆతిథ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సదస్సు ముగిసిన తర్వాత ఏపీ జ్ఞాపకాలను తమ ప్రాంతానికి తీసుకెళ్లే అనుభూతులను అందించేలా కిట్స్ అందించనున్నారు. ఇప్పటికే ఏఏ వస్తువులను జ్ఞాపికలుగా అందించాలనే అంశాలను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. వాటికనుగుణంగా కిట్లను సిద్ధం చేస్తున్నారు.

3 వేల మందికి అందించేలా...

మొత్తం 3 వేల మంది ప్రతినిధులకు ఈ కిట్లు అందించనున్నారు. 8 పేజీల సదస్సు సమాచారం బ్రోచర్‌తో పాటు రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, వనరులు, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, పారిశ్రామిక విధానం, ఐటీ పాలసీ, టూరిజం పాలసీతో పాటు 14 సెక్టార్లకు సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరిచిన బుక్‌లెట్‌ను అందించనున్నారు. వీటితో పాటు ప్రత్యేకమైన జ్ఞాపికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర హస్తకళల్లో ఒకటైన కలంకారీ అద్దకాలతో తయారు చేసిన సెరామిక్ వస్తువులను అందిస్తున్నారు. లగేజ్ ట్యాగ్‌లు, నోట్‌బుక్‌లు, సెరామిక్ ప్లేట్, వుడెన్ కోస్టర్స్‌తో పాటు కిట్‌లో ప్రత్యేక ఆకర్షణగా అరకు ఇన్‌స్టెంట్ కాఫీ పొడిని కూడా అందించనున్నారు.



కిట్‌లో ఉన్న జ్ఞాపికలు

అడ్వాంటేజ్ ఏపీ బ్రాండ్‌గా..



పెట్టుబడుల సదస్సుకు వచ్చే ప్రతి ఒక్క ప్రతినిధికి చిరకాలం గుర్తుండిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని రంగాల్లో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టేందుకు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు కొత్త ప్లాట్‌ఫామ్‌గా మారనుంది. అందుకే సదస్సులో పాల్గొంటున్న ప్రముఖుల కోసం ప్రత్యేక ఆతిథ్యంగా కిట్లను తయారు చేస్తున్నాం. అడ్వాంటేజ్ ఏపీ అనే నినాదం ఒక బ్రాండ్‌గా మారనుంది.

– డా.జి.సృజన, రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్

జైత్రయాత్రకు శ్రీకారం



మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, అనకాపల్లి జిల్లా పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి

- వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ శ్రేణులంతా కంకణబద్ధులు కావాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ మద్దతు అభ్యర్థి సీతంరాజును గెలిపించే బాధ్యత మీదే
- విద్యారంగ అభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఎనలేని కృషి
- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓట్లన్నీ మనకే..
- టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి

సాక్షి, అనకాపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి.. 2024 ఎన్నికల్లో పార్టీ విజయపరంపరకు ఇప్పుడే శ్రీకారం చుట్టాలని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం అనకాపల్లిలోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావులు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికలని, ఈ గెలుపుతో విద్యావంతులంతా విశాఖ పరిపాలనా రాజధానికి మద్దతు తెలుపుతున్నారని చెప్పినట్లు అవుతుందన్నారు. నాలుగు సంవత్సరాలుగా మన ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిని వివరించి ఓటు అడగాలని సూచించారు. ఇటీవల కొన్ని దుష్టశక్తులతో కూడి ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని, వారి యత్నాలను జగనన్న కుటుంబ సభ్యులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సోషల్ మీడియా ప్రతినిధులు తిప్పికొట్టాలని, గడప గడపకూ వెళ్లి వాస్తవాలను వివరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని ప్రజలకు వివరించాలని సూచించారు.



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కో కన్వీనర్లు

అనకాపల్లి నుంచే అత్యధిక ఓట్లు..

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. అనకాపల్లి నియోజకవర్గంలో 4,711 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అనకాపల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు లభించే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మార్చి 18వ తేదీ నుంచి సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. నూకాంబిక అమ్మవారి దేవాలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి రూ.3 కోట్లు మంజూరు చేసినందుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ... కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికీ పార్టీలో తగిన పదవులు వస్తాయన్నారు. ఓటు వేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ.. పెద్దల సభగా పిలిచే శాసనమండలికి ఎంతో ప్రాధాన్యముందని, సుధాకర్‌ను గెలిపించి అలాంటి విధానసభకు పంపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకుడు దాడి రత్నాకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, లక్ష్మీ సౌజన్య, మందపాటి సునీత, కొణతాల నీలిమ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలక యశోద, రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పి.రమేష్ పాల్గొన్నారు.

లక్ష్యం మరవొద్దు



నేపాల్ మాజీ మంత్రి ధరవేష్ కుమార్‌ను సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి (గాజువాక) : దేశం కానీ దేశంలో చదువునభ్యసిస్తున్నారు...లక్ష్యాన్ని మర్చిపోవద్దు.. మన దేశంతో పాటు ఇక్కడ చదువుతున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని నేపాల్ దేశ సాంస్కృతిక, పర్యాటక, విమానయానశాఖ మాజీ మంత్రి, కృష్ణ ఫౌండేషన్ చైర్మన్ ధరవేష్ కుమార్ సూచించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. దువ్వాడ విజ్ఞాన్ విద్యా సంస్థలతోపాటు వివిధ కళాశాలలో నేపాల్‌కు చెందిన మూడు వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈసందర్భంగా వారి సమస్యలపై చర్చించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం తరుపున రావల్సిన స్కాలర్‌షిప్‌లు, ఇతర రాయితీలపై ప్రభుత్వాలతో చర్చిస్తానన్నారు. కళాశాల రెక్టార్ వి.మధుసూధనరావు మాట్లాడుతూ విజ్ఞాన్ యాజమాన్యం నాణ్యమైన, క్రమశిక్షణ, మానవ విలువతో కూడిన విద్యను అందించడంలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. నేపాల్ విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యనందిస్తున్నామన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న చాలా మంది విదేశీ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ధరవేష్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూధనరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్ 10లో

శాస్త్రవేత్తల పరిశోధనలు ఫలవంతం కావాలి

- వాతావరణంలో మార్పులు
- వర్ష రోజులు తగ్గుదల.. వర్షపాతం పెరుగుదల
- జియో ఫిజిక్స్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్
- సముద్ర జలాలపై పరిశ్రమలు, మానవాళి ప్రభావాల జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: శాస్త్రవేత్తల పరిశోధనల ఫలాలు ఫలవంతం కావాలని సర్ ఆర్థర్ కాటన్ జియో స్పెసియల్ చైర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ మాజీ ప్రొఫెసర్ పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం విశాఖలోని ఓ హోటల్‌లో 'సముద్ర జలాలపై పరిశ్రమలు, మానవాళి ప్రభావం' అనే అంశంపై రెండు రోజులపాటు జరుగుతున్న జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. సముద్ర జలాలు వేడెక్కుతుండడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. వర్షం కురిసే రోజులు తగ్గుతున్నాయని, వర్షపాతం పెరుగుతోందని చెప్పారు. ఆధునిక సాంకేతితతో సముద్ర జలాలు స్వచ్ఛంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సముద్ర అధ్యయన శాస్త్రం మరింత బలోపేతం కావాలన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐఓ-గోవా) డైరెక్టర్ సునీల్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ భూతాపం వల్ల వాతావరణ మార్పులతో పాటు సముద్ర వనరులపైనా ప్రభావం పడుతోందని చెప్పారు. ఎన్ఐవో చీఫ్ సైంటిస్ట్ వీవీఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కేజీ బేసిన్ సహా భారత తీర ప్రాంతం చమురు, సహజ వాయువుల నిక్షేపాలతో పాటు ఎన్నో వనరులకు ఆలవాలంగా ఉందన్నారు. ఈ సదస్సుకు భారత భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ, ఎన్ఐవోలకు చెందిన 50 మంది శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సదస్సులో ఎన్ఐవో విశాఖ సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ జీపీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజుకు భారీ మెజార్టీయే లక్ష్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్

వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఆ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ పరిధిలో పలు నియోజకవర్గాల వారీగా కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీలో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తిప్పల నాగిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు.

'పట్టభద్రుల' బరిలో 37 మంది

- 4 నామినేషన్ల తిరస్కరణ, ముగ్గురు ఉపసంహరణ
- మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్
- 16న స్వర్ణభారతి స్టేడియంలో ఉదయం 8 నుంచి కౌంటింగ్
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో 2,89,214 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- నేటి నుంచి బీఎల్‌వోల ఆధ్వర్యంలో ఓటరు స్లిప్పుల పంపిణీ
- మీడియాతో రిటర్నింగ్ అధికారి మల్లికార్జున, సీపీ శ్రీకాంత్ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 37 మంది నిలిచారు. మొత్తం 44 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. ఈ నెల 24 న నిర్వహించిన స్క్రూటినీలో నలుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. మిగిలిన 40 మందిలో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. వీరిలో టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరాములు కూడా ఉన్నారు. సోమవారం ఉపసంహరణ గడువు ముగియడంతో మొత్తం 37 మంది బరిలో నిలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఎ మల్లికార్జున ప్రకటించారు.

మార్చి 13వ తేదీన పోలింగ్, 16న కౌంటింగ్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, ఎన్నికల అబ్జర్వర్ సిద్ధార్థ్ జైన్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ మల్లికార్జున, బందోబస్తుకు సంబంధించిన నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతు అభ్యర్థి డా.వి.చిరంజీవి రావు, బీజేపీ మద్దతు అభ్యర్థి మాధవ్ ప్రధాన పార్టీల తరఫున బరిలో ఉన్నారు. అదేవిధంగా ప్రజా సంఘాల తరఫున కోరెడ్ల రమాప్రభతో పాటు మిగిలిన వారందరూ స్వతంత్ర అభ్యర్థులే పోటీలో నిలిచారు. 2017 లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 మంది బరిలో నిలవగా.. ఈ సారి 37 మంది ఉండటం గమనార్హం.

- బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ప్రచారం, పోలింగ్ సమయంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే అంశాల గురించి సమగ్రంగా వివరించాం.
- మార్చి 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ జరగనుంది. 4 లోపు పోలింగ్ స్టేషన్లోకి వచ్చిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తాం. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తిస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఒకే ప్రాంతంలో ఎక్కువ పోలింగ్ స్టేషన్లుంటే.. వీడియో కెమెరాల ద్వారా చిత్రీకరించనున్నాం.
- ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు ఎన్నికల సిబ్బంది ఉంటారు. తక్కువ ఓటర్లున్న స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు సిబ్బంది ఉంటారు.
- అన్ని జిల్లాల్లోనూ 20 శాతం రిజర్వ్‌తో పోలింగ్ సిబ్బందిని నియమించాం. ఇప్పటికే మొదటి విడత ట్రైనింగ్ పూర్తి చేశాం. మార్చి 7న మరోసారి శిక్షణ అందించనున్నాం. 6 జిల్లాల్లో రెండు కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ల ట్రైనింగ్ కూడా పూర్తయింది.
- 37 మంది 7బీ ఫారంలో ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో పేర్లను అమర్చి.. సీఈవో కార్యాలయానికి పంపిస్తున్నాం. అక్కడి నుంచి అనుమతి వచ్చిన వెంటనే బ్యాలెట్ పేపర్లను తయారు చేయనున్నాం.
- 2,89,214 ఓటర్లకు సంబంధించి ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీని మంగళవారం నుంచి బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపడుతున్నాం. ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత ఓటర్లకు స్లిప్పులు అందించి.. అందుబాటులో లేని వివరాలతో కూడిన ఏఎస్‌డీ జాబితాని 10 రోజుల్లో సిద్ధం చేసి ప్రిసైడింగ్ అధికారులకు అందజేసి, మాల్ ప్రాక్టీస్‌లకు పాల్పడకుండా చర్యలు చేపడుతున్నాం.
- విశాఖ జిల్లా పరిధిలో 15 మంది జోనల్ అధికారులు, 15 మంది రూట్ అధికారులు, 112 మంది బీఎల్‌వోలు, 143 మంది ప్రిసైడింగ్ అధికారులు, 443 మంది ఇతర పోలింగ్ అధికారులు, 112 మంది మైక్రో అబ్జర్వర్లు, 11 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించాం. 112 వెబ్‌కెమెరాలు కూడా సిద్ధం చేశాం.
- ఎన్నికలు జరిగిన తర్వాత ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులు భద్రపరిచి పోలింగ్ తదుపరి రోజున ప్రధాన స్ట్రాంగ్ రూమ్ అయిన స్వర్ణభారతి ఇండోర్ స్టేడియానికి గట్టి భద్రత నడుమ తీసుకువస్తాం.
- 16వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 28 టేబుల్స్‌తో పాటు రిటర్నింగ్ అధికారి టేబుల్ కలిపి మొత్తం 29 టేబుల్స్‌లో కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. ఈ కౌంటింగ్‌ని పూర్తిస్థాయి వీడియో కెమెరాల చిత్రీకరణ నడుమ జరుగుతుంది.
- ప్రచార సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన అభ్యర్థులపై చర్యలు తీసుకుంటున్నాం.
- ఒక అభ్యర్థికి ఒక వ్యక్తిని మాత్రమే ఎలక్షన్ ఏజెంట్‌గానూ, ఒక పోలింగ్ స్టేషన్‌కు ఒక ఏజెంట్‌ని మాత్రమే అనుమతివ్వనున్నాం.
- నిబంధనల ఉల్లంఘనలపై వచ్చిన రాత పూర్వక ఫిర్యాదులపై విచారణ చేపట్టి నివేదికను ఎన్నికల కమిషన్‌కు అందజేశాం
- డూప్లికేట్ ఓట్లు, అసంపూర్తి దరఖాస్తులను స్క్రూటినీ చేసి మొత్తం తొలగించాం.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో సీపీ శ్రీకాంత్, ఎన్నికల అబ్జర్వర్ సిద్ధార్థ్ జైన్

నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ ఏమన్నారంటే..

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సమయంలో భద్రత కోసం 1,142 మంది పోలీసులను విధులకు వినియోగిస్తున్నాం.
- పోలింగ్ రోజున 840 మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. కమిషనరేట్ పరిధిలో 43 లొకేషన్లలో 112 పోలింగ్ స్టేషన్లున్నాయి. ఇందులో 15 రూట్‌మొబైల్స్ ఏర్పాటు చేస్తున్నాం.
- స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు, డిస్ట్రిక్ట్ రిజర్వ్ ఫోర్స్‌ను కూడా అందుబాటులో ఉంటున్నాయి. స్ట్రాంగ్ రూమ్ వద్ద సెంట్రల్ పారా మిలటరీ ఫోర్సు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.
- ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు చేపట్టాల్సిన అన్ని చర్యలు చేపడుతున్నాం.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే..

- ర్యాలీలు, వ్యక్తిగత వాహనాలకు అనుమతి తప్పనిసరి
- పోలింగ్ కేంద్రాలకు 100 మీ. పరిధిలో ప్రచారం చేయకూడదు
- అభ్యర్థులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొనకూడదు
- ఫిర్యాదులను రాతపూర్వకంగా ఇవ్వాల్సిందే..
- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున అభ్యర్థులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో సోమవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్‌తో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ప్రభుత్వ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. ఎలాంటి ఫిర్యాదులనైనా రాత పూర్వకంగా తెలపాలన్నారు. ప్రచారంలో భాగంగా వ్యక్తిగత వాహనాలు, ర్యాలీలు, లౌడ్ స్పీకర్లు కోసం ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు వ్యక్తిగత దూషణలకు పోరాదని, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారాలు, పబ్లిక్ మీటింగులకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. ఓ వ్యక్తి అనుమతి లేకుండా ఆయన ఇంటిని గానీ, ఇంటి ఆవరణాన్ని గానీ వినియోగించకూడదని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిషిద్ధమన్నారు. ఎన్నికల సమయానికి 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని ఆర్వో స్పష్టం చేశారు. డీఆర్వో ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున, చిత్రంలో అబ్జర్వర్ జైన్, సీపీ శ్రీకాంత్

ఆరు జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

అనంతరం ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సీపీ సీహెచ్ శ్రీకాంత్, అబ్జర్వర్ సిద్ధార్థ్ జైన్‌తో కలిసి ఆర్‌వో, కలెక్టర్ డా.మల్లికార్జున వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికల కంటే చాలా భిన్నమైనవని, బ్యాలెట్ పద్ధతిలో జరగనున్న ఈ ఎన్నికలకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. అభ్యర్థుల జాబితా ఖరారైన తరుణంలో పోలింగ్ నిర్వహణకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పనులు చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలను అభ్యర్థులంతా పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. అభ్యర్థుల ప్రచారం కోసం అవసరమైన అనుమతులను ఏకకాలంలో ఒకే చోట పొందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని, ఓటర్లకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

బీచ్‌రోడ్డు: స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో డీఆర్వో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చిన ఏ ఒక్క అర్జీ రీ ఓపెన్ కాకుండా ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులందరూ ఆయా శాఖల వారీగా స్పందనలో వచ్చిన అర్జీలకు వారం చివర రోజున తప్పనిసరిగా పరిష్కారం చూపాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 28వ తేదీ, మార్చి 7వ తేదీన వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో పోలింగ్ సిబ్బందికి వ్యక్తిగత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అనంతరం ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. మొత్తం 191 వినతులు వచ్చినట్లు డీఆర్వో తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి మాధవి, డీఎస్‌వో సూర్య ప్రకాష్‌రావు, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'టౌన్ ప్లానింగ్' కే అధిక ఫిర్యాదులు


కమిషనర్ రాజాబాబుకు సమస్య వివరిస్తున్న బాధితుడు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కమిషనర్ పి.రాజాబాబు సోమవారం నిర్వహించిన స్పందనకు 71 వినతులు వచ్చాయి. వచ్చిన వినతుల్లో అధిక శాతం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, హార్టికల్చర్ విభాగానికి సంబంధించినవే. జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడ గ్రామ ప్రజల సమస్యలపై నియోజకవర్గ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అగనంపూడి గ్రామ సర్వే నంబర్ 29/3లో సుమారు 0.08 సెంట్ల తన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని గాజువాక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని బాధితుడు అల్లూరి శ్రీకర్ కమిషనర్‌కు తెలిపారు. జోన్–2 నుంచి 15, జోన్–3 నుంచి 14, జోన్–4 నుంచి 5, జోన్–5 నుంచి 11, జోన్–6 నుంచి 11, జోన్–7 నుంచి ఒకటి, జోన్–8 నుంచి 2, ప్రధాన కార్యాలయానికి 12 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ప్రజారోగ్యం విభాగానికి 2, టౌన్ ప్లానింగ్‌కు 30, ఇంజినీరింగ్/హార్టికల్చర్‌కు 19, యూసీడీకి 10, రెవెన్యూకి 8, పరిపాలన అండ్ అకౌంట్స్ విభాగానికి 2 వినతులు ఉన్నాయి. వీటిని పరిశీలించి వచ్చిన ఫిర్యాదులను మూడు రోజుల్లో పరిష్కరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, సెక్రటరీ పి.నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరాం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ కృపావాసం, డీపీవో చంద్రిక, యూసీడీ పీవో సూర్యకళ, పర్యవేక్షక ఇంజినీర్లు, టౌన్‌ప్లానింగ్, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 50 వినతులు


మాట్లాడుతున్న సీపీ శ్రీకాంత్

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) డి.గంగాధర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ బలవన్మరణం

భర్త వేధింపులే కారణం?


అలేఖ్య(ఫైల్)

ఆరిలోవ: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలివీ.. ముప్వల అలేఖ్య(29), ఆమె భర్త నరేష్, వారి ఇద్దరు పిల్లలు, కుటుంబ సభ్యులతో కలసి ఎంవీపీకాలనీలో నివాసముండేవారు. ఏఆర్‌లో కానిస్టేబుల్ అయిన నరేష్ ప్రస్తుతం సీబీఐ విభాగంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. భార్యాభర్తల మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. రెండేళ్ల కిందట అలేఖ్య తన ఇద్దరు పిల్లలతో కలసి ఆరిలోవ ప్రాంతం మయూరినగర్ వచ్చేశారు. ఓ ఇల్లు అద్దెకు తీసుకొని అందులోనే ప్లే స్కూల్ నిర్వహిస్తున్నారు. 11 ఏళ్ల వయసు గల కుమారుడిని విజయవాడలో ఓ హాస్టల్‌లో చేర్పించారు. తొమ్మిదేళ్ల కుమార్తెతో కలసి ఆమె ప్రస్తుతం ఆరిలోవలో ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఆమె గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కొంతసేపటికి తల్లి ఫ్యాన్‌కు వేలాడుతున్న దృశ్యాన్ని చూసిన ఆమె కుమార్తె ఏడుస్తూ సెల్‌లో ఉన్న నంబర్లకు ఫోన్ చేసింది. దీంతో వెంటనే ఎంవీపీకాలనీలోని బంధువులు, గాజువాకలో ఉన్న అలేఖ్య తల్లి, బంధువులు ఆరిలోవ చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం పోస్టుమార్టం నిర్వహించి.. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కాగా.. భర్త వేధింపులు తాళలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని అలేఖ్య తల్లి భవాని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు పిల్లలను తనకు అప్పగించాలని వేడుకున్నారు. సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ.. రామ్మూర్తిపంతులుపేటకు చెందిన కరుణకుమార్(35) ఆటోడ్రైవర్. భార్య సబి కూలి పనులకు వెళ్తుంటారు. ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య ఎటువంటి గొడవలు లేవు. ఇంట్లో ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని ఆదివారం రాత్రి భార్య సబి భర్తను అడిగింది. డబ్బులు ఇవ్వనని.. ఇంటికి కావాల్సిన సరకులు నేనే తేస్తానని చెప్పి ఆయన బయటకు వెళ్లాడు. కొంత సేపటికి చికెన్ తీసుకొచ్చాడు. తానే వంట చేస్తానని చెప్పి.. ఇంట్లోకి ఎవ్వరూ రావద్దని తలుపులు వేసుకున్నాడు. కొంతసేపటికి తలుపు కొట్టినా తీయకపోవడంతో భార్య ఇరుగు పొరుగు వారికి చెప్పింది. దీంతో వారు వచ్చి చూడగా కరుణకుమార్ ఇంట్లో హుక్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. అర్ధరాత్రి 2 గంటలకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు

బీచ్‌రోడ్డు: ప్రేమ విఫలమైందని ఓ అమ్మాయి, లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని రక్షించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలివీ... నగరానికి చెందిన ఓ యువతి ఆదివారం ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన ప్రేమ విఫలం అయిందని.. తనకు జీవితంపై విరక్తితో బీచ్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు ఆర్.కె.బీచ్‌కు చేరుకుని అవుట్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించారు. అక్కడ విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ కంట్రోల్ రూమ్‌కు ఆ యువతి ఫోన్ నంబర్ తెలియజేశారు. టెక్ సెల్ సిబ్బంది రంగంలోకి దిగి ఆ యువతి ఏయూ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆమెను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నగరానికి చెందిన ఓ వ్యక్తి లోన్ యాప్ ద్వారా లోన్ తీసుకున్నాడు. ఆ యాప్ నిర్వాహకులు తీసుకున్న రుణం కంటే అధిక మొత్తం వసూళ్లు చేసి మరింత నగదు చెల్లించాలని వేధింపులు మొదలుపెట్టారు. అతడి ఫొటోలు మార్ఫింగ్ చేసి వారి కుటుంబ సభ్యులకు పంపడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆత్మహత్యకు సిద్ధమై సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని తెలియజేస్తూ పోస్ట్ పెట్టాడు. ఈ పోస్ట్ ద్వారా పోలీసులు ఆ వ్యక్తిని ఛేదించి, అతని సమస్యకు తగిన పరిష్కారం చూపిస్తామని కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆ యాప్ నిర్వాహకులపై సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ రెండు ఘటనల్లో సకాలంలో స్పందించి ఇద్దరి ప్రాణాలను కాపాడిన నగర పోలీసులను సీపీ శ్రీకాంత్ అభినందించారు.

పలు రైళ్ల గమ్యం కుదింపు.. రద్దు

తాటిచెట్లపాలెం: ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఆధునీకరణ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్‌లో మార్చి 2, 3, 5 తేదీల్లో బయలుదేరే సికింద్రాబాద్–హౌరా(12704) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ కటక్ వరకు, తిరుగు ప్రయాణంలో మార్చి 3, 4, 6 తేదీల్లో హౌరా–సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ కటక్ నుంచి సికింద్రాబాద్ రాకపోకలు సాగించనుంది. ఈ తేదీల్లో కటక్– హౌరా మధ్య ఈ రైలు రాకపోకలు సాగించదు.
- కిరండూల్‌లో మార్చి 1న బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(08552) ఎక్స్‌ప్రెస్ జయ్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. అక్కడ నుంచి తిరిగి కిరండూల్ చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో మార్చి 1న బయల్దేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్ (08551) అరకు వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో అక్కడ నుంచి విశాఖపట్నం చేరుకుంటుంది.

రద్దయిన రైళ్లు

- విశాఖపట్నంలో ఫిబ్రవరి 28న బయలుదేరే విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ రద్దు
- కిరండూల్‌లో మార్చి 1న బయలుదేరే కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ రద్దు

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,020
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.51,350
వెండి(కిలో):	రూ.69,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
స్కిన్	: రూ.160
స్కిన్‌లెస్	: రూ.170

సీతంరాజు గెలుపునకు కృషి చేయండి

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫరూఖీ పిలుపు


మాట్లాడుతున్న ఫరూఖీ

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం ముస్లిం యువతంతా పనిచేయాలని పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూఖీ పిలుపునిచ్చారు. రామాటాకీస్ సమీపంలోని ఆల్ మాస్క్ ప్రెసిడెంట్ అహ్మదుల్లా ఖాన్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీతంరాజు సుధాకర్‌కు మైనార్టీ పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. చట్టసభల్లో ముస్లింకు డిప్యూటీ సీఎం హోదా కల్పించడమే కాకుండా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సమావేశంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, మైనార్టీ నాయకులు ఇబ్రహీం మాగ్బూల్ నిజాం భాషా, మదీనా తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడిగా రామునాయుడు


సొసైటీ పాలకపక్షం

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌ఈఎల్–హెచ్‌పీవీపీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఆఫీస్ బేరర్ల ఎన్నికల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఎన్నికల అధికారి సమక్షంలో ఆఫీస్ బేరర్ల ఎన్నిక చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి సీహెచ్‌ఎస్ త్రినాథరావు మాట్లాడుతూ సొసైటీ అధ్యక్షుడిగా కొరుపోలు రామునాయుడు, ఉపాధ్యక్షుడిగా కొండాల ధర్మారావు, కార్యదర్శిగా మండా వెంకటరాజులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు. సంస్థ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖ నిర్ణయం హర్షణీయం


నరవ ప్రకాశరావు

మద్దిలపాలెం: పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో మొదటి తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని విద్యాశాఖ జి.వో.నం.24 జారీ చేయడం హర్షణీయమని రైట్ టూ ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. దీనికి సంబంధించి మార్చి 5న లంకపల్లి బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణ కార్యకర్తలు, ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు ఈ సదస్సుకి హాజరుకావాలని కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ ప్రతిభ

దెందులూరు: హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఏలూరు జిల్లా దెందులూరు మండలం వేగవరంలోని హేలాపురి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం జిల్లాపై పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించింది. విశాఖపట్నం జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు అక్షర స్కూల్ కరస్పాండెంట్ పాలడుగు అర్చనా చౌదరి, హేలాపురి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాధాకృష్ణ, ఏవో కరుణానిధి, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు భూపతి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

రేపటి నుంచి శ్రీకృష్ణ చైతన్య జయంత్యుత్సవాలు


మాట్లాడుతున్న పీఠాధిపతి స్వామి భక్తి సాధవ్

డాబాగార్డెన్స్: జిల్లా పరిషత్ సమీపంలోని శ్రీ కృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో మార్చి ఒకటి నుంచి వారం రోజుల పాటు శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠాధిపతి స్వామి భక్తి సాధవ్ కేశవ్ మహారాజ్ తెలిపారు. మఠం ప్రాంగణంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. మార్చి ఒకటిన శోభాయాత్ర, తీర్థ ప్రసాద గోష్ఠి, 2న మహాసంకల్పం, 3న సీతారామచంద్రస్వామికి నవకలశ స్నపనం, 4న నారసింహ సహిత సుదర్శన ఇష్టి, మండలరచన, 5న సుదర్శన నారసింహ ఇష్టి, పూర్ణాహుతి, 6న శ్రీకృష్ణునికి ద్వాదశ కలశ స్నానం, అర్చనలు, మంగళస్నానం, 7న శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాస కల్యాణం, శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు జయంత్యుత్సవం వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చేనేత వస్త్ర ప్రదర్శన భేష్


ఇంటి అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

పీఎంపాలెం: శిల్పారామం(జాతర)లో చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతోంది. ఈ ఎగ్జిబిషన్‌లో రాష్ట్రంలో పేరొందిన చేనేత వస్త్ర ఉత్పత్తులతో పాటు వివిధ రాష్ట్రాల ఉత్పత్తులను ఇక్కడ తయారీ ధరకే విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ సుమారు 100 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన విక్రయాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. పోచంపల్లి, నారాయణ్ పేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారీ, ఫ్యాన్సీ ఖాదీ, కాటన్ ప్రింటెడ్ బెంగాల్ సిల్క్, కాంత్ వర్క్ కాటన్, భాగ్‌పూర్ సిల్క్, బాందనీ చిల్క్, వరంగల్ టవల్స్, బెడ్ షీట్లు, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, గుజరాత్ కాటన్ టాప్స్, డోర్ కర్టెన్స్, విండో కర్టెన్స్, విండో మ్యాట్స్, జైపూర్ టాప్స్, జైపూర్ బెడ్ షీట్లు, ఖాదీ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్నారు. కాగా.. విక్రయదారులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు జాతర పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు.